కుల గణనను కేంద్రం సమగ్రంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కాసాని వీరేష్

నిజాంపేట్: కుల గణనను కేంద్రం సమగ్రంగా చేపట్టాలని, జనాభా దామాషా పద్ధతిలో బీసీ వర్గాలకు వాటాలు పంచాలని బీసీ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నిర్ణయంతో ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న బీసీల న్యాయమైన పోరాటం వల్ల బీసీల కల సాకారం కాబోతుందని హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత సమ్మర్ క్యాంప్ ప్రారంభం



సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న పున్నారెడ్డి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్‌లోని ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ ఎస్పీఆర్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్‌ను శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ సాంటిరెడ్డి పున్నారెడ్డి ప్రారంభించారు. క్యాంప్‌లో అబాకస్, పెయింటింగ్, కర్రసాము, స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 30 రోజుల పాటు సాగే ఈ సమ్మర్ క్యాంప్ ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చైతన్య పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



కుత్బుల్లాపూర్: నియోజకవర్గ దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను కలిసి సన్మానించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి అనుమకొండ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణకై పోరాటం చేసి విజయ తీరం చేర్చిన ఘనత మందకృష్ణకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి, నాయకులు బూదాల విజయభాస్కరరావు, కాటం దేవయ్య, బూరు రవి, కలుమూరి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి,సిటీబ్యూరో: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వాల్యూవేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఈనెల 16 లోగా ప్రధానోపాధ్యాయుడికి ఫీజు చెల్లించాలని కోరారు.

ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: భగవత్ రామానుజాచార్యుల జయంతి సందర్భంగా పద్మానగర్ ఫేజ్ 1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలతో పాటు తిరుమంజనం (అభిషేకం) నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పంచామృతాభిషేకం నిర్వహించారు.



ఇంపాక్ట్ క్లబ్స్ ఇంటర్నేషనల్ స్థాపకుడు గంపా నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ వర్కుషాప్–187 బ్యాచ్ ట్రైనింగ్ విజయవంతంగా ముగిసింది. అటెండెన్స్, అసైన్మెంట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీనివాస్ నాగమల్లి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

– కుత్బుల్లాపూర్

అందుబాటులోకి ఆట..!

- ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో ఇండోర్ షటిల్ కోర్టు నిర్మాణంపై హర్షం
- బాచుపల్లి, చింతల్, సుచిత్రకు వెళ్లాల్సిన పని తప్పిందంటున్న స్థానికులు
- క్రీడాకారులకు టాయిలెట్స్ సదుపాయం కల్పించాలని వినతి

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో ఇండోర్ షటిల్ కోర్టును జీహెచ్ఎంసీ నిర్మించడంపై ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూపా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో షటిల్ క్రీడాకారులు ఇక్కడకు వచ్చి షటిల్ ఆడుకుంటున్నారు. గతంలో కాలనీవాసులు షటిల్ ఆడాలంటే బాచుపల్లి, చింతల్, సుచిత్ర వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కాలనీలో సదుపాయం కలగడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులకు మంచినీటితో పాటు టాయిలెట్స్ సదుపాయం కలుగజేస్తే ఇంకా సంతోషంగా ఉంటుందని కాలనీవాసులు అంటున్నారు.



షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

కాలనీ స్థలంలో రూ.3 కోట్లతో నిర్మాణం

నవంబర్ 2022లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సూరిబాబు కాలనీ అసోషియేషన్, కాలనీ ప్రజల ప్రోత్సాహంతో 23 నెలల్లో ఇండోర్ కోర్టు పనులను పూర్తి చేశారు.



ఎస్.ఆర్.నాయక్‌నగరలో ఏర్పాటు చేసిన షటిల్ ఇండోర్ కోర్టు

ఎకరం స్థలంలో ఇండోర్ స్టేడియం

ఇండోర్ కోర్టు లోపల ఒకేసారి 12మంది క్రీడాకారలు ఆడుకునేల మ్యాటింగ్‌తో మూడు సింథటిక్ కోర్టులను ఏర్పాటు చేశారు. క్రీడాకారుల కోసం కోర్టు లోపల ఎల్ఈడీ లైటింగ్‌లో పాటు టేబుల్ ఫ్యాన్‌లను అమర్చారు. కోర్టుల చుట్టూ క్రీడాకారులు కుర్చీల్లో కూర్చునేలా కొంత మేరకు స్థలాన్ని వదిలారు. 7వేల చదరపు ఆడుగుల్లో మూడు సింథటిక్ షటిల్ కోర్టులు నిర్మించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే బుకింగ్స్, క్రీడాకారులు ప్రతి నెల కొంత చెల్లించేలా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి ఒక సిస్టం తీసుకువస్తామని కాంట్రాక్టర్ అన్నారు.

టోర్నమెంట్లు నిర్వహించేందుకు సిద్ధం



కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కేటాయించిన షటిల్ ఇండోర్ కోర్టు మా కాలనీలో నిర్మించడం అనందంగా ఉంది. మా కాలనీ, అపురూపాకాలనీలో షటిల్ ఆడే క్రీడాకారులు చాలా మంది ఉన్నారు. యువ క్రీడాకారులు ఇక్కడ సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనేది మా అకాంక్ష. మా ఇరు కాలనీల తరపున మేము సంవత్సరంలో రెండుసార్లు ఇక్కడ టోర్నమెంట్లు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

– టీటీకే శ్రీనివాస్ (ఎస్ఆర్.నాయక్‌నగర్ అధ్యక్షుడు)

మేము ఊహించలేదు



మాకు షటిల్ ఆటపై మక్కువతో ఇంతకు ముందు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆడేవాళ్లం. ఇప్పుడు మా ఇళ్ల మధ్యలోనే షటిల్‌కోర్టును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఇది మేము ఊహించలేనిది.

– రాఘవయ్య, కాలనీవాసి

సంతోషంగా ఉంది



ఫిట్‌గా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మనం పట్టు సాధించాలి. అలా అని రోడ్లపైన ఆడలేం. మాకు దగ్గరలో మా కాలనీలో ఇండోర్ షటిల్ కోర్టులు రావడం చాలా సంతోషంగా ఉంది. మేము తప్పకుండా ప్రతిరోజు ఇక్కడ షటిల్ ఆడాలని నిర్ణయించుకున్నాం.

– సుస్మిత, అపురూపాకాలనీ

జీహెచ్ఎంసీకి కృతజ్ఞతలు



నాకు షటిల్ ఆడాలనే కోరిక ఉండేది కాని మాకు దగ్గలో ఎక్కడ ఇండోర్ స్టేడియం లేదు. మా కాలనీలో ఇండోర్ కోర్టు ఏర్పాటు కావడం మాకు వరం. మూడ్రోజులుగా ఇక్కడకు వచ్చి షటిల్ ఆడుతున్నాం. మా కాలనీలో షటిల్ కోర్టు నిర్మించిన జీహెచ్ఎంసీ వారికి కృతజ్ఞతలు.

– దివ్య, అపురూపాకాలనీ

సెలవుల్లో హాస్టళ్లను కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: వేసవి సెలవుల సమయంలో కూడా హాస్టళ్లను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఎస్పీఆర్‌యూ కార్యదర్శి పవిత్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీఆర్ యూనివర్సిటీ వీసీకి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఈటీ, టీపీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు విశ్వవిద్యాలయంలోనే తలదాచుకోగల స్థలాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక హాస్టల్ వసతి అందించడం లేదా తక్కువ ఖర్చుతో షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల అవసరాలు తీర్చినవారవుతారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్ : బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె.. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి క్లాస్ రూమ్‌ల నిర్మాణానికి స్థలంలో హద్దులు చూపించాల్సిందిగా ఆర్డీవోని ఆదేశించారు. అమలేశ్వరి, అరుణ్ రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని విధాలా అభివృద్ధి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్‌లో రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ జగన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.3 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేసి ఇటీవల ప్రారంభోత్సవం నిర్వహించామన్నారు. కొందరు నాయకులు ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంపై చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులంటే అభివృద్ధి కారకులుగా ఉండాలి కాని నిరోధకులుగా ఉండొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, మైసమ్మ నగర్ బీ బ్లాక్ అధ్యక్షుడు బసవప్ప గుప్తా, జనరల్ సెక్రటరీ బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన బైకిస్టును పేట్‌బషీరాబాద్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ పోచమ్మ ఆలయ సమీపంలో నివాసముండే కొత్తగూడ సాయితేజ గత 29న సాయంత్రం జీడిమెట్ల పారిశ్రామికవాడ పీబీ ఇంజినీరింగ్ వర్క్స్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న అబ్దుల్ వసీంను బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో అతను సరిగ్గా బండి నడపమని అనడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాయితేజ చేతి కడియంతో వసీంపై పిడి గుద్దులు గుద్దాడు. గాయపడిన వసీంను స్థానికులు క్లినిక్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

‘టీవీఆర్’ విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో టీవీఆర్ గ్రూప్ చైర్మన్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో శుక్రవారం మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీవీఆర్ గ్రూప్ చైర్మన్ కోటిరెడ్డి చేతులు మీదుగా 500కు పైబడి మార్కులు సాధించిన 67 మంది విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికలతో ముందుకు సాగితే జీవిత ఆశయాన్ని సాధించి ఉన్నత శిఖరాలను చేరుతారన్నారు. రానున్న ఐదేళ్లు కష్టపడి చదివితే జీవితాంతం సుఖపడతారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారంలో చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం డాక్టర్ గజేంద్రబాబు ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై గజేంద్రబాబు దంపతులను సన్మానించారు. 30 ఏళ్ల సేవలందించి ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ వినోద్ జాదవ్

రంగారెడ్డినగర్: టెన్త్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ వినోద్ జాదవ్ సన్మానించారు. కె. శృతి 573/600, ముఫీన్ ,565/600, లక్ష్మీ ప్రసన్న 564/600, బి.ప్రవీణ్ 563/600, శివం కుమార్ ఝా 561/600, అనురాగ్ యాదవ్ 557/600, రుతుజా బొరోలే 557/600, అంబటి హాసిని 556/600, సి.రుచిత 555/600, జోయ తబస్సుమ్ 554/600 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వినోద్ జాదవ్ మాట్లాడుతూ.. టెన్త్ ఫలితాల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించడం, 30కి పైగా విద్యార్థులు 500 పై చిలుకు మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల అంకుటిత దీక్షతోనే గొప్ప ఫలితాలు సాధించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి అయేషా బేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల క్యాపిటల్ వర్క్ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు జయరామ్‌నగర్, రుక్మిణి ఎస్టేట్స్, గణేష్ కాలనీ, శ్రీకృష్ణనగర్, జేకే నగర్, 11కేవీ సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయిబాబానగర్, వాజ్‌పేయినగర్, పద్మనగర్ ఫేజ్ 2, నాగుల కుంట, ఎం.ఎస్.రెడినగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు. కొంపల్లి సెక్షన్ పరిధిలో..

☛ 11కేవీ దూలపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు సాయిబాబా ఆలయం, రేషన్ దుకాణం, ఎస్సీ కాలనీ, దూలపల్లి గ్రామం, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో సురక్ష ఆసుపత్రి లేన్, సెంట్రల్ పార్క్, కొంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంతం, 11కేవీ ధోలారీ ధనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పోచమ్మ గడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి గోదాములు, వెంకట్‌రెడ్డి గోదాములు, ధోలారీ ధనీ, 11కేవీ జయభేరీ ఫీడర్ పరిధిలో అశ్విని కాలనీ, జయభేరీ బ్యాంక్ కాలనీ రోడ్డు, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో వెన్‌సాయి, శిఖర నివాస్, ఆర్‌కే కేఫ్, దత్తా అపార్ట్‌మెంట్స్, రాయల్ మీడోస్, 11కేవీ విఘ్నేశ్వర ఫీడర్ పరిధిలో జయభేరి బ్యాంక్ కాలనీ, శివాలయం రోడ్డు, కేవీఆర్ గార్డెన్ రోడ్డు, 11కే నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు జయభేరి బ్యాంక్ కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



130 డివిజన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సుభాష్‌నగర్ డివిజన్‌లో..

జీడిమెట్ల: దేశవ్యాప్తంగా కులగణన, జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్ వాసు అన్నారు. శుక్రవారం 130 డివిజన్‌లో పార్టీ అధ్యక్షుడు శాంపూర్ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అపురూపాకాలనీలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిబాబు, శ్రీనివాస్‌గుప్తా, సురేష్ నాయుడు, మారుతీ నాయుడు, సాయిరెడ్డి, రాంనాయుడు, రంగారెడ్డి, కిరణ్‌పాల్, సత్యనారాయణ, భారతీరెడ్డి, సీతామహాలక్ష్మి, వనమాల, మౌనిక, బబ్లూ, చందూ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్: బీసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సహ ప్రచార కార్యదర్శి పత్తి రఘుపతి అన్నారు. సూరారం డివిజన్‌లో పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ కులగణనతో బీసీ వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగనుందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ వర్మ, సంగీత, సురేష్ గౌడ్, సైదులు, మాసాని రమేష్, ప్రమీల, సరోజ తదితరులు పాల్గొన్నారు.

☛ సుభాష్‌నగర్ డివిజన్ రామ్‌లీలా మైదానంలో డివిజన్ అధ్యక్షుడు మారి గణేష్, కంది శ్రీరాములు ఆధ్వర్యంలో పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బైండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.